బోనాల చెక్కుల పంపిణీ

పికెట్‌లోని క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వాహకులకు బోనాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, ఆగస్టు 3: కోట్ల నిధులను వెచ్చించి నగరంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శనివారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బోనాల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పండగలకు సమ ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఈనెల 4, 5తేదీల్లో కంటోన్మెంట్‌లో జరిగే బోనాలకు ఆయా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సి.సంతోషియాదవ్, బల్వంతరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌతం మోడల్ పాఠశాలలో క్యాబినెట్ సంస్థాపన

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం, ఆగస్టు 3: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి గౌతం మోడల్ పాఠశాలలో శనివారం క్యాబినెట్ సంస్థాపన (ఇన్‌స్టాలేషన్) ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ బలరాం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: ఓయూ ఇంజినీరింగ్ కళాశాల అకాడమిక్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం ఘనంగా జరిగింది. 2023-2024 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొత్తం 22 బంగారు పతకాలు, నగదు బహుమతులు, ర్యాంక్ సర్టిఫికెట్లను అందజేశారు. ముఖ్యఅతిథిగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ ఎన్.బలరాం హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతున్న రంగాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. వీటి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయన్నారు. యువకులు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించేందుకు అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయని తెలిపారు. సంస్థలు స్థాపించి కేవలం ఉన్న అవకాశాలనే కాకుండా ఎగుమతులు చేసే దశకు చేరుకోవాలని ఉద్బోధించారు. నేర్చుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సూచించారు. వర్సిటీలో చదివిన ప్రతిఒక్కరి భవిష్యత్తు నిర్మాణానికి నేర్చుకున్నది పునాదిగా ఉపయోగపడుతుందని అన్నారు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారాన్ని అమెరికాకు చెందిన కృష్ణ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ వ్యవస్థాపకుడు గోపాల్ టీకే కృష్ణకు అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. జ్ఞానాన్ని సాటి వారితో పంచుకున్నప్పుడే అది మరింత వృద్ధి చెందుతుందని చెప్పారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించిన సాయిమానస ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మోస్‌చిప్ టెక్నాలజీస్ ఎండీ, సీఈవో శ్రీనివాస కాకుమాను, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నర్సింహులు సాంకె, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ విజయ్‌కుమార్, సీడాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణయ్య, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తదితరులు పాల్గొన్నారు.



నాలుగు బంగారు పతకాలు సాధించిన విద్యార్థిని సాయి మానసకు రిబ్ సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథులు

హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజనిని సన్మానిస్తున్న అధ్యాపకులు

'విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: విద్యార్థులు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని అధ్యాపకులు సూచించారు. సంబంధిత రంగంలో జ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకోవాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్ఆర్‌డీ) భవనంలోని ఈ-క్లాస్ రూంలో విద్యార్థులకు 'ఇంటర్వ్యూ ప్రిపరేషన్ స్కిల్స్'పై ఉచిత శిక్షణను శనివారం ప్రారంభించారు. హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి, ఓయూ మైక్రోబయాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ సందీప్త, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ హమీదాబీ, బయోకెమిస్ట్రీ విభాగం మెడ్ ప్రొఫెసర్ మంజుల, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కరుణ, న్యూట్రిషన్ విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ రాజు పడియ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి శిక్షణతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

పేదలకు నిరంతర సేవలు: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఆగస్టు 3: నిరుపేదలకు నిరంతరం వెన్నుదన్నుగా నిలుస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. దాదాపు 155 మందికి రూ.56 లక్షల విలువజేసే చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ప్రతి ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, సునీతరమేశ్, శైలజ, ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ యువ నేత రామేశ్వర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతి సభను జయప్రదం చేయండి

గద్దర్ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్-తెలంగాణ స్టేట్ (యూటీఏసీ- టీఎస్) అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరుశురాం మాట్లాడుతూ.. ఈనెల 6న మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులు, కర్షకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఏసీ నాయకులు శ్రీనివాస్, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రమేశ్, డాక్టర్ బాలకోటినాయక్, డాక్టర్ అర్జున్, డాక్టర్ సమీ పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

తిరుమలగిరి ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

బొల్లారం, ఆగస్టు 3: డ్రగ్స్, మత్తుపదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుమలగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. శనివారం తిరుమలగిరి ప్రభుత్వ బాలికల పాఠశాలలో డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడితే జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. చెడు అలవాట్లుకు గురికాకుండా చదువుపై శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, నాగరిక సురక్ష ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు జేఈ టీకాలు

శనివారం హమాలీబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో బస్తీ దవాఖాన డాక్టర్ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఏఎన్ఎం జీనత్ ఆధ్వర్యంలో 15 ఏండ్లలోపు చిన్నారులకు జేఈ టీకాలను వేశారు. మెదడువాపు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ పిల్లలను కాపాడుతుందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల టీచర్ శిరీష, స్టాఫ్ నర్సు నిర్మల, అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. - బన్సీలాల్‌పేట్

బోనాల ఉత్సవాలపై జెడ్సీకి వినతి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 3: ఆగస్టు 11, 12తేదీల్లో జరుగనున్న బోనాల ఉత్సవాల సందర్భంగా వివిధ ఆలయాల పరిసరాల్లో పారిశుధ్యం నెలకొల్పాలని, చెట్టుకొమ్మలు, మట్టికుప్పలు తొలగించాలని, ప్యాచ్‌వర్క్‌లను పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, కె.వెంకటేశ్, మహేందర్, ముక్కశ్రీను, హరిచారి శనివారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సిఫారసు చేసిన లేఖను జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి అందజేశారు. బోయిగూడ, బన్సీలాల్‌పేట్, బీజేఆర్‌నగర్, ఐడీహెచ్‌కాలనీ, జైనగర్, భోలక్‌పూర్, జైప్రకాశ్‌నగర్, సున్నంబట్టి, గొల్లకొమరయ్య కాలనీల్లో బోనాల ఉత్సవాలు జరుగుతాయని అన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం

కమిటీ సభ్యులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సికింద్రాబాద్, ఆగస్టు 3: చిలకలగూడ కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆషాఢ బోనాల జాతరలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినందుకు శనివారం ఆలయ ప్రాంగణంలో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, దేవేందర్‌యాదవ్, ప్రధాన అర్చకులు తిరుమలచార్యులతో పాటు నాయకులు గడ్డం ప్రసాద్, ఓయూ రాజు, రాజేశ్‌నాయుడు, బ్యాంక్ రమేశ్, గుంటి నరేశ్, కన్నా, ఆనంద్, లలిత, జాన్సీ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం విజయవంతం చేయాలి

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన జడ్సీ రవికిరణ్

సికింద్రాబాద్, ఆగస్టు 3: ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ అధికారులను ఆదేశించారు. శనివారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. 5 రోజులు ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 1:45 వరకు జరుగుతుందని చెప్పారు. 5న చెత్త కుప్పల తొలగింపు, 6న దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు,కాల్వలు ముంపు ప్రాంతాల పరిశీలన, 7న నీటివనరులు, సరస్సులు, 8న కాల్వలు, నాళాలు, 9న పార్కుల పరిశీలన ఉంటుందని చెప్పారు. సమావేశంలో అధికారులు వి.సమ్మయ్య, మారుతి దివాకర్, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్ సద్గుణ, ఏంవోహెచ్, డీపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

30 ఏండ్ల పోరాటానికి ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. చాచానెహ్రూనగర్‌లో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు సీపీ శంకర్, రాజేందర్, వేద్‌ప్రకాశ్‌యాదవ్, శ్రావణ్, శ్రీనివాస్, జగదీశ్, లవకుమార్, యాదవచారి పాల్గొన్నారు. - బన్సీలాల్‌పేట్

యూకేలో వృత్తి, విద్యావకాశాలపై సదస్సు

ఖైరతాబాద్, ఆగస్టు 3: గ్లోబల్ ట్రీ, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అల్లుమ్నీ సంయుక్తాధ్వర్యంలో యూకేలో వృత్తి, విద్యావకాశాలపై శనివారం విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ ఆలపాటి, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అల్లుమ్నీ యూకే చైర్ పర్సన్ సనమ్‌ఆరోరా, విల్లా మేరీ కళాశాల ప్రిన్సిపాల్ రేవతిమతూర్ పాల్గొని విద్యార్థులకు విదేశాల్లో విద్య అవకాశాలు, విశ్వవిద్యాలయాల వివరాలు, కేరీర్, వీసా ప్రక్రియలపై అవగాహన కల్పించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

అమీర్‌పేట్ డివిజన్ కుమ్మరి బస్తీకి చెఉందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు నిమ్మ నరేందర్‌రెడ్డి మాతృమూర్తి నిమ్మ భాగ్యలక్ష్మి శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి శనివారం భాగ్యలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం నరేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు హనుమంతరావు, అశోక్‌యాదవ్, సంతోష్, కూతురు నర్సింహ, గుడిగె శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు. శుక్రవారం మృతిచెందిన బీజేఆర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రవికిరణ్ మాతృమూర్తి ధనమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. - అమీర్‌పేట్

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

మేకలమండి పాఠశాలలో నోట్ పుస్తకాలు అందజేసిన టాలెంట్ స్ప్రింట్ డైరెక్టర్ స్ఫూర్తి

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 3: భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం టాలెంట్ స్ప్రింట్ సంస్థ డైరెక్టర్ స్ఫూర్తి ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థులకు నోట్ పుస్తకాలు, టై, బెల్టులను అందజేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, చిత్తశుద్ధితో చదువుకోవాలని ఆమె అన్నారు. పాఠశాల విద్యార్థుల తరపున పూర్వ హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వరూప, ఉపాధ్యాయులు పరశురాం, మహేశ్, సునీత, నిత్య, ఫర్జానా, రైసా దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలు ఇప్పటికే విడుదలయ్యాయన్నారు. మెమోలు ఈనెల 10 తర్వాత తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 17లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 31వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఈ కోర్సుల ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) ఎనిమిదో సెమిస్టర్, బీఈ (సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్, బీఈ (నాన్ సీబీసీఎస్) నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ మేకప్, బ్లాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును ఈనెల 12లోగా చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూడాలన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు

వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, పీఎస్‌వై డీ క్లినికల్ సైకాలజీ, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: స్థానిక ఉత్పత్తుల కొనుగోలును ప్రోత్సహించాలని స్వదేశీ జాగరణ మంచ్ అఖిల భారత సంఘటన కార్యదర్శి కాశ్మీర్‌లాల్ అన్నారు. స్వదేశీ భావనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఓయూ గెస్ట్‌హౌస్‌లో స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ప్రాంత విచార వర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కాశ్మీర్‌లాల్, కర్ణాటక సెంట్రల్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భట్టు సత్యనారాయణ, బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మధ్య క్షేత్ర సంయోజక్ సత్తు లింగమూర్తి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న స్థితిగతులతో పాటు స్వావలంబి భారత్ అభియాన్, వికసిత భారత్ సంకల్పయాత్రలతో నూతన వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం లభిస్తోందని చెప్పారు. వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల్లో స్థానిక ఉత్పత్తులు, స్వదేశీ వ్యాపారుల ప్రోత్సాహం వంటి అంశాలు ప్రాధాన్యంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధిలో ఆర్థిక స్వాతంత్ర్యం స్వావలంబన దిశగా ముందుకెళ్లేందుకు కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కాశ్మీర్‌లాల్

నేడు ఆషాఢ బోనాలు

సికింద్రాబాద్, ఆగస్టు 3: ఆషాఢ బోనాల జాతరకు సీతాఫల్‌మండి పరిధిలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. అలాగే మేడిబావి ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయంలో అమ్మవారి జాతరను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఫౌండర్ ట్రస్టీ పరికిబండ కళాప్రకాశ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యలు కలుగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. శనివారం అర్ధరాత్రి 12గంటలకు ఆలయ ఫౌండర్ ట్రస్టీ పరికిబండ కళా ప్రకాశ్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి మొదటి బోనం సమర్పిస్తారు. దీంతో బోనాల పండుగ ప్రారంభం అవుతుంది. ఆదివారం అమ్మవారి బోనాలు, సోమవారం సాయంత్రం రంగం ఉంటుందని తెలిపారు. 60ఏండ్లుగా లాల్ దర్వాజాకు చెందిన లక్ష్మమ్మ భవిష్యవాణి వినిపిస్తున్నారని పేర్కొన్నారు.

ఆలయానికి ప్రముఖుల రాక..

వేడుకలకు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి సీతక్కలతో పాటు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్, తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. జాతరలో సందర్భంగా చిలకలగూడ పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

చిన్నారుల ఫ్రెండ్‌షిప్ డే

బీకేగూడ అంగన్వాడీలో జరిగిన చిన్నారుల ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఆకట్టుకున్నాయి. అంగన్వాడీ సూపర్‌వైజర్ పి.అరుణ, టీచర్ కొప్పుల స్వామి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. పిల్లలు ఫ్రెండ్‌షిప్ డేలో చేసిన సందడితో మురిసిపోయారు. చిట్టి చిట్టి చేతులతో చిన్నారులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కడుతుండడం అంగన్వాడీలో పండుగ వాతావరణాన్ని సృష్టించింది. - అమీర్‌పేట్